క్లుప్తంగా

వీధి కుక్కల పట్టివేత



కుక్కలను ట్రాక్టర్‌లో తరలిస్తున్న సిబ్బంది

పీలేరురూరల్ : పీలేరు గ్రామ పంచాయతీ పరిధిలో 52 వీధి కుక్కలను పట్టించినట్లు ఈవో గురుమోహన్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని పలు ప్రాంతాలలో సిబ్బంచే వీధి కుక్కలను పట్టించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ కుక్కల బెడదపై ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు నాలుగు రోజులుగా కుక్కలను పట్టే కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. పట్టిన కుక్కలను అటవీప్రాంతంలో వదలిపెడతామన్నారు.

స్వచ్ఛతా హీ సేవా

పెద్దతిప్పసముద్రం : మండలంలోని రంగసముద్రంలో మంగళవారం ఎంపీడీవో కేఎస్ బాలాజీ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రీన్ అంబాసిడర్లచే గ్రామ పురవీధుల్లో ర్యాలీ చేపట్టారు. అనంతరం పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత, తడి, పొడి చెత్త సేకరణ ద్వారా ఎరువుల తయారీ విధానంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి శివప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా డాక్టర్ అనిబిసెంట్ జయంతి వేడుకలు

మదనపల్లె సిటీ : బీటీ కళాశాల వ్యవస్థాపకురాలు డాక్టర్ అనిబిసెంట్ 177వ జయంతి వేడుకలు స్థానిక బెంగళూరు రోడ్డులోని మరసం కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. అనిబిసెంట్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మరసం కార్యదర్శి లింగాల యుగంధరాచారి మాట్లాడుతూ మదనపల్లెలో కాలేజీ స్థాపించి ఎంతో మందికి విద్యను అందించిందన్నారు. ఆమె చేసిన సేవలు ఇప్పటికి మరిచిపోలేమన్నారు. విదేశీ వనితి అయినా మనదేశం కోసం ఎన్నో సేవలు చేశారన్నారు. బీటీ కాలేజీ రిటైర్డు ప్రిన్సిపాల్ వై.ఎస్.మునిరత్నం, అధ్యాపకులు సభాపతి, రచయితలు తదితరులు పాల్గొన్నారు.

రైతు ఉత్పత్తిదారుల సంఘం ఏర్పాటు

పీలేరు : పీలేరుకు చెందిన ప్రకృతి వ్యవసాయ నిపుణుడు బోదిషావలి ఆధ్వర్యంలో రైతు ఉత్పత్తిదారు సంఘం(ఎఎఫ్ఓ) ఏర్పాటైంది. ఈ మేరకు మంగళవారం ఎఫ్‌వో రిజిస్ట్రేషన్ కొరకు జిల్లా ఉద్యానశాఖ అధికారి రవిచంద్రబాబుకు రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఆర్‌శ్యాట్ ఆధ్వర్యంలో రెండు తెలుగు రాష్ట్రాలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. సుమారు 200 మంది రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో వివిధ వాణిజ్య పంటలు పండించి విజయవంతం అయినట్లు చెప్పారు. నెక్ట్సజెన్ పేరుతో రైతు ఉత్పత్తిదారుల సంఘాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఇంటింటికీ పెన్షన్‌ల పంపిణీ

మదనపల్లె : ఎన్‌టీఆర్ భరోసా సామాజిక పెన్షన్‌ల పంపిణీలో భాగంగా మంగళవారం సచివాలయ సిబ్బంది ఇంటింటికీ పింఛన్ల పంపిణీ చేశారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మదనపల్లె మండలంలో చిలకవారిపల్లె, మిట్టపల్లె, సీటీఎం-2, కొత్తవారిపల్లె-2, దుబ్బిగానిపల్లె, తురకపల్లె, తట్టివారిపల్లె, మదనపల్లె మున్సిపాలిటీ పరిధిలోని రెడ్డెప్పనాయుడు కాలనీ, గొల్లపల్లె, ఎస్‌బీఐ కాలనీ, సొసైటీకాలనీ, గాంధీపురం, నక్కలదిన్నె, నెమలినగర్, బసినికొండ, రామాచార్లపల్లె, నిమ్మనపల్లె మండలంలోని రెడ్డివారిపల్లె, వడ్డిపల్లె, కొత్త ఇండ్లు, కొత్తపల్లె, దాదినాయునితాండా, రామసముద్రం మండలంలోని చెంబకూరు, అరికెల, మాలేనత్తం, మినికి, చొక్కాండ్లపల్లె, ఊలపాడు, ఎలవానెల్లూరు గ్రామాల్లో అవ్వాతాతలకు పెన్షన్ అందజేశారు.

నేటి నుంచి దసరా శెలవులు

పెద్దతిప్పసముద్రం : ప్రభుత్వ పాఠశాలలకు ఈనెల 2 నుంచి 13 వరకు దసరా శెలవులు ప్రకటించినట్లు ఎంఈఓలు నారాయణ, గౌస్‌పీర్ తెలిపారు. 14న ప్రభుత్వ పాఠశాలలు యథావిధిగా తెరచుకుంటాయన్నారు.

రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు కన్నెమడుగు విద్యార్థులు



రోహిత



ప్రవణ్‌కుమార్‌రెడ్డి

తంబళ్లపల్లె : స్కూల్ గేమ్స్ అండర్ -17 బాలి, బాలికల ఉమ్మడి చిత్తూరు జిల్లా హాకీ జట్టు ఎంపిక పోటీ మంగళవారం సీటీఎం జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగాయి. తంబళ్లపల్లె మండలం కన్నెమడుగు జెడ్పీ ఉన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థిని రోహిత, బాలుర విభాగంలో తొమ్మిదో తరగతి ప్రణవ్‌కుమార్‌రెడ్డి స్టాండ్ బైగా ఎంపికయ్యారు.

ప్రతిభచాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడంతో హెచ్‌ఎం మదన్‌మోహన్, పీడీ మొఘల్‌ఖాదర్‌బాషా, ఉపాధ్యాయులు అభినందించారు.

ముస్తాబవుతున్న అమ్మవారి ఆలయాలు

● రేపటి నుంచి ప్రారంభంకానున్న దసరా ఉత్సవాలు



ప్రత్యేక అలంకరణలో శ్రీ లలిత త్రిపురసుందరిదేవి అమ్మవారు



కన్యకా పరమేశ్వరి ఆలయం ఎదుట వేసిన చలువ పందిళ్లు

మదనపల్లె సిటీ : దసరా శరన్నవరాత్రులకు అమ్మవారి ఆలయాలు ముస్తాబవుతున్నాయి. జిల్లాలో పేరు ప్రఖ్యాతులు గాంచిన శ్రీ వాసవీ కన్యాకా పరమేశ్వరి ఆలయంలో దసరా ఉత్సావలు వైభవంగా నిర్వహిస్తారు. దీంతో పాటు నీరుగట్టువారిపల్లెలో వెలసిన శ్రీ చౌడేశ్వరి ఆలయంలో దసరా ఉత్సవాలు కన్నుల పండువగా చేస్తారు. ఉత్సవాలకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవార్లను దర్శించుకుంటారు. గురువారం నుంచి దసరా ఉత్సవాల కు శ్రీకారం చుట్టనున్నారు.

మొదటి రోజు 3వ తేదీన బాలత్రిపుర సుందరిదేవి అలంకారం, 4వ తేదీన గాయిత్రిదేవి అలంకారం, 5వ తేదీన శ్రీ అన్నపూర్ణదేవి అలంకారం, 6వ తేదీన శ్రీ లలితాదేవి అలంకారం, 7వ తేదీన శ్రీ దుర్గాదేవి అలంకారం, 8వ తే దీన శ్రీ సంతాన లక్ష్మిదేవి అలంకారం, 9వ తేదీన శ్రీ సరస్వతి అలంకారం, 10వ తేదీన మహిషాసురమర్ధిని అలంకారం, 11వ తేదీన శ్రీ రాజరాజేశ్వరి అలంకారం, 12వ తేదీన శ్రీ ధనలక్ష్మి అలంకారం నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పూనగంటి ఓం ప్రకాష్ తెలిపారు. ఆర్యవైశ్య, యువజన, అనుబంధ సంఘాలతో కార్యక్రమాలు రోజు నిర్వహిస్తామన్నారు. స్థానిక నీరగట్టువారిపల్లెలోని చౌడేశ్వరి ఆలయంలో ఈనెల 3 నుంచి 12వ తేదీ వరకు దసరా ఉత్సవాల్లో భాగంగా ప్రతి రోజు అ మ్మ వారికి ఒక్కో అలంకారంతో అమ్మవారు భక్తుల కు దర్శనం కల్పిస్తామని తొగటవీరక్షత్రియ సంఘం అధ్యక్షుడు పురాణం చంద్రశేఖర్ తెలిపారు. స్థానిక దేవళంవీధిలోని శ్రీ సోమేశ్వరస్వామి ఆలయంలో శ్రీ లలితా త్రిపురసుందరిదేవి అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేయనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు ఆలూరి ఫణికుమార్‌శర్మ తెలిపారు. 3వ తేదీన శ్రీ కామాక్షిదేవి, 4వ తేదీన శ్రీ విష్ణుదుర్గ, 5వ తేదీన శ్రీరాజశ్యామల, 6వ తేదీన శ్రీ మహాలక్ష్మిదేవి, 7వ తేదీన శ్రీ అన్నపూర్ణదేవి, 8వ తేదీన శ్రీ వారాహిదేవి, 9వ తేదీన శ్రీ సరస్వతిదేవి, 10వ తేదీన శ్రీలతిత్రిపురసుందరిదేవి, 11వ తేదీన శ్రీ దుర్గాదేవి, 12వ తేదీన శ్రీ విజయ చాముండేశ్వరిదేవి అలంకారంతో భక్తులకు అమ్మవారిని దర్శనం కల్పిస్తారు. దీంతోపాటు సీటీఎం రోడ్డులోని శ్రీరాజరాజేశ్వరి ఆలయం, కోర్టులోని గంగమ్మ ఆలయాల్లో దసరా ఉత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు.

వృద్ధులను ప్రేమతో చూసుకోవాలి



సీనియర్ సిటిజెన్స్‌ను సన్మానిస్తున్న రిటైర్డు డీఎంహెచ్‌ఓ వెంకటరమణ

మదనపల్లె సిటీ : వృద్ధులను అప్యాయంగా చూసుకోవాలని విశ్రాంత డీఎంహెచ్‌ఓ డాక్టర్ పూల వెంకటరమణ తెలిపారు. మంగళవారం ప్రపంచ వృద్ధుల దినోత్సవం పురస్కరించుకుని స్థానిక వెలుగు వృద్ధాశ్రమంలో సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహించిన సీనియర్ సిటిజెన్స్‌కు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీనియర్ సిటిజెన్స్‌కు ప్రత్యేక చట్టాలు ఉన్నాయన్నారు. సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.మునిగోపాలకృష్ణ, అడ్వయిజర్ శ్రీనివాసులు, రిటైర్డు ప్రిన్సిపాల్ వై.ఎస్.మునిరత్నం, మహిళా అధ్యక్షురాలు ధనలక్ష్మిలకు మెమెంటో అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎఎస్ఐ చంద్రయ్య, వెలుగు కార్యదర్శి ఉదయమోహన్‌రెడ్డి, కన్వీనర్ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకిపురం : వృద్ధుల ఆరోగ్యం పట్ల వారి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు శ్రద్ధ వహించాలని హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ తెలిపారు. అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవంను మంగళవారం మండలంలోని చింతపర్తి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంచూరు గ్రామంలో నిర్వహించారు. కార్యక్రమంలో టీబీ యూనిట్ సూపర్‌వైజర్ నాగిరెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీ వనిత, ఎఎస్‌ఎం భారతమ్మ పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఫ్లెక్సీనీ ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

ములకలచెరువు : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫ్లెక్సీనీ ధ్వంసం చేసి దుర్భాషలాడిన టీడీపీ ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు, జనసేన ఎమ్మెల్యే పంతం నానాజీని పోలీసులు వెంటనే అరెస్టు చేయాలని మండల బహుజన సమాజ్‌పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం వారు మండల కేంద్రంలో సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా దాడులకు దిగడం హేమమైన చర్య అన్నారు. వారిపై చర్యలు తీసుకోకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామన్నారు. సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జి మల్లికార్జున, నాయకులు నాగభూషణ, నరసింహులు తదితరులు ఉన్నారు.

విఆర్వోల బదిలీలు

కలికిరి : మండలంలో పలువురు వీర్వోలను బదిలీ చేస్తూ జిల్లా ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. వడ్డి విజ్ఞాన్‌ను కలికిరి-1 నుంచి మదనపల్లి మండలం బడినికొండ-1కు, ఎస్.తస్లీమాను కలికిరి-4 నుంచి మండలంలోని గుండ్లూరు గ్రామానికి, కె.కదిరప్పను గుట్టపాళెం నుంచి పీలేరు మండలం తలపుల-2కు, టి.ప్రసాద్‌రెడ్డిని కలికిరి-1కు, ఆర్.విశ్వనాథను కలికిరి-2 నుంచి వాల్మీకిపురం మండలం గండబోయనపల్లికి, ఎస్.సుధాకర్‌ను పత్తేగడ నుంచి పీలేరు-1కు, టి.చంద్రయ్యను గుండ్లూరు నుంచి మదనపల్లి మండలం కొత్తపల్లికి, దొరస్వామిని మహల్ నుంచి గుర్రంకొండ-1కు, కె.కృష్ణయ్యను మర్రికుంటపల్లి నుంచి నిమ్మనపల్లి మండలం బండపై గ్రామానికి బదిలీ చేశారు. అలాగే మండలంలోని మర్రికుంటపల్లి గ్రామానికి నిమ్మనపల్లి మండలం బండ్లపై నుంచి డి.వేణుగోపాల్‌రెడ్డిని, పీలేరు-4 నుంచి కలికిరి-4కు టి.శిల్పాకుమారిని, కేవీపల్లి మండలం మద్దిపట్లవాండ్లపల్లి నుంచి దశరథను మండలంలోని గుట్టపాళెం గ్రామానికి, మదనపల్లి సొసైటీ కాలని నుంచి బి.గౌరిని కలికిరి-3 సచివాలయానికి, మదనపల్లి మండలం చీకలబైలు నుంచి కె.రెడ్డిరాణిని కలికిరి-2 సచివాలయానికి, పీలేరు-1 నుంచి ఎ.ఆదిలక్ష్మిని మండలంలోని మహల్ గ్రామానికి బదిలీ చేశారు.

శాంతి, సహోదరత్వంతోనే ఐక్యత



అశోకుడి విగ్రహం ఎదుట ఆశీర్వచనాలు అందిస్తున్న బౌద్ధబిక్షువు

మదనపల్లె : శాంతి, సహోదరత్వంతోనే భారతీయుల మధ్య ఐక్యత సాధించగలమని మదనపల్లె ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషా తెలిపారు. దేశంలో శాంతి, సమానత్వం కాంక్షిస్తూ, బుద్ధిస్ట్ ఫ్రెటర్నటీ కౌన్సిల్, నేషనల్ ధమ్మయాత్ర కమిటీ సంయుక్తంగా కేరళలోని బుద్ధభూమి నుంచి మహారాష్ట్రలోని దీక్షాభూమి వరకు చేపట్టిన అశోక-అంబేడ్కర్. ధమ్మయాత్ర మంగళవారం మదనపల్లెకు చేరుకుంది. అపూర్వ స్వాగతం లభించింది. బుద్ధ అంబేడ్కర్ సమాజ్ ఫౌండర్, ట్రస్టీ పీటీఎం.శివప్రసాద్ ఆధ్వర్యంలో పెద్దసంఖ్యలో అంబేడ్కర్ అనుయాయులు, ఆర్టీసీబస్టాండు సమీపంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్దకు చేరుకుని, బౌద్ధబిక్షువులకు, యాత్ర నిర్వాహకులకు పుష్పగుచ్చాలు ఇచ్చి స్వాగతం పలికారు. ఎమ్మెల్యే డాక్టర్.బీఆర్.అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి శాంతి సహోదరత్వ యాత్రను ప్రారంభించారు. బౌద్ధబిక్షువులు మౌర్యన్ బుద్ధర్, సిద్ధారక్కిత, బుద్ధశీలర్, బుద్ధిస్ట్ ఫ్రెటర్నిటీ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్.భారతిప్రభు, పీటీఎం శివప్రసాద్ తదితరులు శాంతి, సహోదరత్వం ఆవశ్యకతను వివరించారు. అనంతరం ర్యాలీ కొనసాగింది.

వాల్మీకిపురం : కేరళ నుంచి నాగపూర్ చేపట్టిన అశోక-అంబేడ్కర్ ధమ్మయాత్ర మంగళవారం వాల్మీకిపురంకు చేరుకుంది. ఈ యాత్రకు స్థానిక మాలమహానాడు నాయకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బౌద్ధబిక్షులు మాట్లాడుతూ డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ బౌద్ధమతంలో చేరిన రోజును పురస్కరించుకుని నాగపూర్‌లో అశోక్ చక్రవర్తి విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

కిరాక్ ఆర్పీ బేషరతుగా క్షమాపణలు చెప్పాలి

మదనపల్లె : మహిళలపై అసభ్యంగా, అనుచితవ్యాఖ్యలు చేస్తూ, వెకిలిచేష్టలు ప్రదర్శిస్తున్న జబర్దస్త్ ఫేం కిరాక్ ఆర్పీ తన పద్ధతి మార్చుకుని బేషరతుగా క్షమాపణలు చెప్పాలని రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ రాష్ట్ర మహిళా కార్యదర్శి ఎర్రగుంట్ల పద్మప్రియారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ మాజీ మంత్రి ఆర్.కే.రోజా, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి భార్య వైఎస్.భారతీరెడ్డిని టీవీ ఛానల్స్ ప్రెస్‌మీట్లలో ఇష్టం వచ్చినట్లుగా కిరాక్ ఆర్పీ మాట్లాడటం ఆమోదయోగ్యం కాదన్నారు. సంఘంలో పేరుప్రఖ్యాతులు కలిగిన మహిళలపై బాడీ షేమింగ్ చేస్తూ, అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. ఇలాంటి చర్యలు మహిళల గౌరవానికి భంగం కలిగించేవని, ఎవరు చేసినా తప్పక ఖండించాల్సిందేనన్నారు. జబర్దస్త్ కిరాక్ ఆర్పీ చేసిన వ్యాఖ్యలపై బేషరతుగా క్షమాపణ చెప్పాలని, సంబంధిత అధికారులు కఠినచర్యలు తీసుకోవాలన్నారు. భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా పటిష్టమైన విధానాలు చేపట్టాలన్నారు. మాజీ మంత్రి రోజాతో పాటు, ఇలాంటి వేధింపులు ఎదుర్కొంటున్న మహిళలందరికీ రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కాలువ శ్రీలతరెడ్డి, కార్యదర్శి ఎర్రగుంట్ల పద్మప్రియారెడ్డి, ఉపాధ్యక్షురాలు రమాదేవి తదితరులు సంఘీభావం తెలుపుతున్నామన్నారు.

చైతన్యయాత్రలు

నిమ్మనపల్లె : అక్టోబర్ 16న ప్రపంచ ఆహార దినోత్సవాన్ని ఆకలి దినోత్సవంగా ప్రకటిస్తూ 15 రోజుల పాటు చైతన్యయాత్రలు నిర్వహిస్తున్నట్లు ఏపీ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ రాష్ట్ర మహిళా కార్యదర్శి కే.శోభ తెలిపారు. మంగళవారం నిమ్మనపల్లె పంచాయతీ కొత్తవారిపల్లెలో యూనియన్ కమిటీ సభ్యులతో కలిసి కరపత్రాలను విడుదల చేసి ర్యాలీ నిర్వహించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 77 సంవత్సరాలు అవుతున్నా, 50 శాతానికి పైగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు తిండికి కూడా నోచుకోలేని స్థితిలో ఉన్నారన్నారు. పేదల హక్కులు కాగితాలకు, ప్రసంగాలకు మాత్రమే పరిమితమయ్యాయన్నారు. ప్రభుత్వాలు చిత్తశుద్ధితో వీటిని అమలుచేసినప్పుడే పేదప్రజల ఆకలికేకలు ఆగుతాయన్నారు.

యువత రక్తదానం చేయాలి



రక్తదానం చేసిన వారికి గుర్తింపు పత్రం అందచేస్తున్న ఆలయ ధర్మకర్త, వైద్య నిపుణులు

మదనపల్లె సిటీ : యువత రక్తదానం చేయాలని స్థానిక వన్‌టౌన్ సీఐ చాంద్‌బాషా తెలిపారు. మంగళవారం స్థానిక ఇందిరానగర్ మెట్రోకాంప్లెక్స్ వద్ద హెల్పింగ్‌మైండ్స్ ఆధ్వర్యంలో జాతీయ రక్తదాన దినోత్సవం పురస్కరించుకుని రక్తదాన శిబిరం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ రక్తదానం చేసే పది మంది ప్రాణాలు కాపాడినవారవుతారన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, అత్యవసర పరిస్థితులు రక్తం అవసరమన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రక్తదానం చేయడం వల్ల ఎంతో మంది ప్రాణాలు కాపాడవచ్చునన్నారు. ఇలాంటి శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. 38 మంది రక్తదానం చేశారు. హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకులు అబూబకర్‌సిద్ధిక్, బ్లడ్ బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు. అలాగే బీటీ కాలేజీలో రక్తదాన శిబిరం నిర్వహించారు.

వాల్మీకిపురం : రక్తదానం చేసి ప్రాణాలను కాపాడాలని స్థానిక ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఫైరోజా బేగం తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 37 మంది రక్తదానం చేశారన్నారు. ఆరోగ్యంగా ఉన్న వ్యక్తులు రక్తదానం చేయడం వలన ఆపదలో ఉన్న మరొక్కరి ప్రాణాలను కాపాడవచ్చునన్నారు. కార్యక్రమంలో అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కలికిరి : రక్తదానం ప్రాణదానంతో సమానమని ఎల్లమ్మ ఆలయ ధర్మకర్త అశోక్‌కుమార్‌రెడ్డి, వైద్య నిపుణులు లోకవర్ధన్, విష్ణుశివప్రసాద్ తెలిపారు. ప్రపంచ బ్లడ్ డొనేషన్ దినోత్సవం సందర్భంగా కలికిరి సేవా సంకల్ప చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక ఎల్లమ్మ ఆలయ ఆవరణలో మంగళవారం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. 18 సం.లు నిండిన ప్రతి ఆరోగ్యకర వ్యక్తి రక్తదానం చేయవచ్చని, రక్తదానం చేసిన వారు ఆపదలో మరొకరి ప్రాణాలు కాపాడిన వారవుతారన్నారు. జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల, శ్రీనివాసా డిగ్రీ కళాశాల విద్యార్థులు, స్థానిక యువత మొత్తం 37 యూనిట్లు రక్తదానం చేశారు. రాయచోటి దీప బ్లడ్ బ్యాంక్ సిబ్బంది హాజరై బ్లడ్ సేకరించి, గుర్తింపు పత్రాలు అందచేశారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రెసిడెంట్ షేక్ రియాజుల్లా, కార్యదర్శి ఇనాయతుల్లా, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, ట్రస్టు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బ నివారణకు మంచినీరు అధికంగా తాగండి

కలకడ : వడదెబ్బ నివారణకు ప్రతి ఒక్కరూ మంచి నీటిని అధికంగా తాగాలని డాక్టర్ కిషోర్‌కుమార్ రెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని ఎర్రకోటపల్లె పీహెచ్‌సీ పరిధి కె.దొడ్డిపల్లెలో ఏర్పాటు చేసిన ఫ్యామిలీ ఫిజిషియన్ వైద్యసేవలు అందించారు. ఎలాంటి అనారోగ్యపరిస్థితి ఎదురైనా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి రావాలన్నారు. అవసరమైన వారికి మందులు అందించారు. 104, 108 సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ జయరామయ్య, సూపర్‌వైజర్ వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఏకగ్రీవం

వాల్మీకిపురం : మాల మహానాడు నూతన కా ర్యవర్గాన్ని ఆ సంఘం జాతీయ వర్కింగ్ ప్రెసి డెంట్ యమల సుదర్శన్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మాల మహానాడు పీలే రు నియోజకవర్గ ఇన్‌చార్జిగా చింతపర్తికి చెందిన చిరంజీవి, వాల్మీకిపురం మండల అధ్యక్షుడిగా నాగార్జున, సెక్రటరీలుగా మనోజ్‌కుమా ర్, గౌతమ్, గౌరవ అధ్యక్షుడు బీవీ రమణ, ఉ పాధ్యాక్షుడు రమణ, కోశాధికారిగా శ్రీనివాసులు, యూత్ ప్రెసిడెంట్‌గా ప్రవీణ్‌కుమార్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సుదర్శన్ మాట్లాడుతూ మాలలు ఐక్యమత్యంగా ఉండి మన హక్కుల సాధన కోసం పోరాడాలని పిలుపునిచ్చారు.

తహసీల్దార్‌కు భవన నిర్మాణ కార్మికుల వినతి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

ములకలచెరువు : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రోజు నుంచి ఇసుక రవాణా పూర్తిగా నిలిచిపోవడంతో భవన నిర్మాణ పనులు నిలిచిపోయాయని మండలానికి చెందిన కార్మికులు మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ ప్రదీప్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. మూడు నెలల నుంచి ఇసుక కొరతతో భవన నిర్మాణాలు పూర్తిగా నిలిచిపోయాయని ఆవేధన వ్యక్తం చేశారు. కొంత మంది అక్రమార్కులు రూ.4 వేల నుంచి రూ.5 వేలతో ఇసుకను తరలిస్తూ తన జేబులు నింపుకుంటున్నారన్నారు. ఇసుకను ఫ్రీగా అందిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం మాటలు నీటి మూటలుగా నిలిచాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి ఇసును అందుబాటులోకి తెచ్చి తమను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు తదిరులు ఉన్నారు.

చట్టం తనపని తాను చేసుకుని పోతుంది



రామసముద్రం పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న డీఎస్పీ కొండయ్యనాయుడు

రామసముద్రం : స్థానిక పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం మదనపల్లె డీఎస్పీ దర్బార్ కొండయ్యనాయుడు తనిఖీ చేసి స్టేషన్ రికార్డులను పరిశీలించి పలు కేసు వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా, రౌడీయిజం, గుండాయిజంను ప్రోత్సహిస్తే ఊపేక్షించేదు లేదన్నారు. మండల పోలీస్‌స్టేషన్ పరిధిలో శాంతి భద్రతలను కాపాడేందుకు పోలీస్ సిబ్బంది ముందుంటారన్నారు. అక్రమ రవాణా, కర్నాటక మద్యంపై ఉక్కుపాదం మోపాలన్నారు. మండలంలోని కర్నాటక సరిహద్దులోని చెక్‌పోస్ట్ వద్ద ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎలాంటి సంఘటనలు జరగకుండా సిబ్బంది విధులు నిర్వర్తించాలన్నారు. అనంతరం కర్నాటక సరిహద్దులను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో సీఐ రమేష్, ఎస్ఐ వెంకటసుబ్బయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఎక్సైజ్ సీఐ, ఎస్ఐలు బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన ఎక్సైజ్ సీఐ సి.హెచ్. వెంకటసుబ్బారెడ్డి, ఎస్ఐ బి.చైతన్య

పీలేరు రూరల్ : పీలేరు ఎక్సైజ్ సీఐగా సి.హెచ్. వెంకటసుబ్బారెడ్డి, ఎస్ఐగా బి.చైతన్య మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు ఇక్కడ సీఐగా బి.శ్యాంప్రసాద్ తిరుపతి ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో తిరుపతి ఎక్సైజ్‌లో పని చేస్తున్న సి.హెచ్.వెంకటసుబ్బారెడ్డి బదిలీపై పీలేరుకు వచ్చారు. ఇక్కడ ఎస్ఐగా ఉన్న లక్ష్మీనరసయ్య బదిలీపై రాయచోటికి వెళ్లారు. ఆయన స్థానంలో పులిచెర్లలో ఎక్సైజ్ ఎస్ఐగా ఉన్న బి.చైతన్య బదిలీపై పీలేరుకు వచ్చారు.

కార్యకర్తలు అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం



వైఎస్సార్‌సీపీ నాయకులతో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కేవీపల్లె : వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఎవరూ అధైర్యపడాల్సిన అవసరంలేదని, తాము అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తెలిపారు. ఇటీవల టీడీపీ నాయకుల దాడిలో గాయపడ్డ మండంలోని దిగువవగళ్లకు చెందిన తారకనాథరెడ్డిని ఆయన మంగళవారం వారి గ్రామానికి వెళ్లి పరామర్శించారు. అలాగే మండలంలోని మఠంపల్లె పంచాయతీ దూరేవాండ్లపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కావలి వెంకటపతినాయుడు మృతి చెందిన విషయం తెలుసుకుని మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీని నమ్ముకుని పార్టీకోసం పని చేసిన ప్రతి ఒక్కరికీ తమవంతు సహకారం ఉంటుందన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తల దాడులకు భయపడాల్సిన అవసరం లేదన్నారు. గ్రామాల్లో ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వెంకటరమణారెడ్డి, ఎంపీపీ ఈశ్వరమ్మ, ఎంపీటీసీ సూర్యనారాయణరెడ్డి, సర్పంచ్ రాజన్న, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సూక్ష్మపోషక లోపాల నివారణ చేపట్టండి



టమాటా పంటలో సూక్ష్మపోషకాల లోపంపై రైతులకు వివరిస్తున్న ఏఓ నాగప్రసాద్

మదనపల్లె : టమాటా, వరి పైరుల్లో సూక్ష్మపోషక లోపాలు ఉంటే, తక్షణం సవరించుకోవాలని లేకపోతే దిగుబడులు తగ్గుతాయని మండల ఏఓ నాగప్రసాద్ తెలిపారు. మండలంలోని సీటీఎం పంచాయతీ రేగంటివారిపల్లె గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఓతో పాటుగా కేవీకే శాస్త్రవేత్త శ్రీనివాస్, మదనపల్లె హార్టికల్చర్ ఆఫీసర్ ఓ.ఈశ్వర్‌రెడ్డి బృందం పొలాలను పరిశీలించారు. రైతులకు సస్యరక్షణ చర్యలు సూచించారు. జీవ ఎరువులు తప్పనిసరిగా వాడాలని రైతులకు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా చిలకవారిపల్లె, సీసీపల్లె ప్రాంతాల్లోని పొలాలను పరిశీలించారు. కార్యక్రమంలో వెటర్నరీ నరసింహారెడ్డి, సిరికల్చర్ ఆఫీసర్ రసూల్, వీహెచ్‌ఏ సుబ్రహ్మణ్యం, నాగేశ్వరి, రైతులు పాల్గొన్నారు.

చెకుముకి విజేతలకు బహుమతులు



విద్యార్థులకు బహుమతులను అందిస్తున్న జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ప్రభుచరణ్

వాల్మీకిపురం : జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్థానిక పీవీసీ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి చెకుముకి పోటీలలో విజేతలైన విద్యార్థులకు జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ప్రభుచరణ్ బహుమతులను అందజేశారు. మండలస్థాయి చెకుముకి పోటీ పరీక్షలలో ఏపీ మైనార్టీ గురుకుల పాఠశాల విదాయర్థులు సాయిలీల, చరిష్మా, ఉమ్రాభాను మొదటి స్థానంలో నిలవగా, రెండవ స్థానంలో జిల్లా పరిషత్ పాఠశాల, చింతపర్తి విద్యార్థులు నందకిషోర్, భాను, లాలస నిలిచారు. వీరు ఈనెల 27న రాయచోటిలో జరిగే జిల్లా స్థాయి పరీక్షలలో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సావిత్రి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుర్రంకొండ : జిల్లా జనవిజ్ఞాన వేది వారి ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక తెలుగు జెడ్పీ హైస్కూల్లో మండలస్థాయిలో నిర్వహించిన చెకుముకీ టాలెంట్ టెస్ట్‌లో గుర్రంకొండ హైస్కూల్‌కు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల్లో జస్సీంబాషా, వైష్ణవి, లక్ష్మీప్రియ, కోల్‌కోల్‌శ్రీజ, హఫ్షీన్, తప్సియాలు విజేతలుగా నిలిచారు. వీరికి పతకాలు, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ప్రతిభ చూపిన గుర్రంకొండ, మర్రిపాడు జెడ్పీహైస్కూళ్లకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారని అన్నారు. కార్యక్రమంలో ఆటల పోటీల మండల కన్వీనర్ అరవింద్‌రెడ్డి, హెడ్మాస్టర్ అహ్మద్‌బాషా, పీడీ రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మదనపల్లె సిటీ : జన విజ్ఞాన వేదిక చెకుముకి టాలెంట్ టెస్టులు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతాయని జేవీవీ జిల్లా గౌరవ అధ్యక్షుడు హరీంద్రనాథ్ తెలిపారు. మంగళవారం స్థానిక జీఆర్‌టీ ఉన్నత పాఠశాలలో చెకుముకి పోటీలు నిర్వహించారు. గత 34 సంవత్సరాల నుంచి టెస్టులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మూఢ విశ్వాసాలకు దూరంగా ఉండటం వంటివి శాస్త్రీయ దృక్పథంతో ముందుకు వెళ్లేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. మండల స్థాయిలో ప్రైవేటు స్కూల్ నుంచి జ్ఞానోదయ పాఠశాల, ప్రభుత్వ పాఠశాలల్లో రామిరెడ్డి లేవుట్‌లోని వివేకానంద మున్సిపల్ పాఠశాల, సీటీఎం జెడ్పీ ఉన్నత పాఠశాల, షిర్డి సాయి ఇంగ్లీషు మీడియం స్కూల్ విజతేలుగా నిలిచారు. ఇందులో గెలుపొందినవారు ఈనెల 27న రాయచోటిలోని డైటలో జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు హరింద్రనాథ్, నక్కా చంద్ర, తారకరామనాయుడు, భాస్కరన్ తదితరులు పాల్గొన్నారు.

నిమ్మనపల్లె : మండలస్థాయిలో జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన చెకుముకి టాలెంట్‌టెస్ట్‌లో రెడ్డివారిపల్లె మోడల్‌స్కూల్ విద్యార్థులు విజేతలుగా నిలిచారని నిమ్మనపల్లె జెడ్పీహైస్కూల్ హెచ్‌ఎం.అంజద్‌అలీఖాన్ తెలిపారు. మోడల్‌స్కూల్ విద్యార్థులు సి.హాసిని, వికాస్‌రెడ్డి, తేజేస్‌లు మొదటిస్థానం పొందారన్నారు. రెండోస్థానంలో జెడ్పీహైస్కూల్(తెలుగు) విద్యార్థులు డి.చరిత, కే.శృతి, ఎం.సాయిలిఖిత నిలిచారన్నారు. మూడోస్థానంలో జెడ్పీహైస్కూల్ రెడ్డివారిపల్లె విద్యార్థులు నిలిచారని తెలిపారు. విజేతలకు సర్టిఫికేట్లు, మెడల్స్, ట్రోఫీలను హెచ్‌ఎం అంజాద్‌అలీఖాన్ అందజేశారు. మొదటిస్థానంలో నిలిచిన విద్యార్థులు రాయచోటిలో నిర్వహించే జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.